16

# తనకు కలిగినదానితో చేయగలిగింది చేస్తున్న సంఘం

## (3:7-13)

ప్రభువు అతి మంచి అతి చెడు సంఘాలను ఆఖరికి ఉంచారు. ఈ పాఠంలో అతి శ్రేష్ఠమైన సంఘాన్ని గూర్చి చదువుతాం: ఫిలదెల్ఫియ.

సార్దీస్‌కు[1] ఫిలదెల్ఫియ ఆగ్నేయ దిశగా ఉంది. అది తీరప్రాంతంలో అంత పెద్ద, అంత ఐశ్వర్యముగల, అంత ఖ్యాతిగల పట్టణం వంటిది కాదు, కాని జ్ఞాపకం ఉంచుకోగల పలు మంచి లక్షణాలు దాని కున్నాయి. దాని పేరు దాని స్థాపకుని ఘనపరచుతోంది. అతడు పెర్గము రాజైన అట్టాలస్ II ఫిలదెల్ఫస్. "ఫిలదెల్ఫస్" అనేది "ప్రేమ" (*philia*) అనే గ్రీకు పదాన్ని "సోదరుడు" (*adelphos*) అనే మాటతో కలుపుతుంది. అలా ఆ పదం "సోదరుని పట్ల ప్రేమ" లేక "సహోదర ప్రేమ."[2] అనే అర్థాన్నిస్తుంది. అట్టాలస్‌కు ఈ బిరుదు తన అన్నయైన యూమెనెస్ పట్ల కనబరచిన విశ్వాసాన్ని బట్టి ఇవ్వబడింది.

అది ముసియ, లిడియా, ఫ్రిగియాలకు వెళ్లే వాణిజ్య మార్గాల్లో నిలిచినదై, ఫిలదెల్ఫియ "తూర్పునకు సింహ ద్వారంగా" పేరుగొన్నది. లిడియా, ఫ్రిగియాలకు గ్రీకు భాష, గ్రీకు నాగరికత వ్యాపింపజేయు మిషినెరీ పట్టణంగా అట్టాలస్ దానిని స్థాపించాడు. అది పెద్ద పట్టణమేమీ కాదు, కాని అది సారవంతమైన ప్రాంతంలో నిర్మింపబడినదై ద్రాక్షా పంటకు ప్రసిద్ధిగాంచింది. గుడులు, ప్రభుత్వ భవనాలు సంఖ్యలోను, వైభవంలోను ఆధిక్యంగా ఉన్నందున, కొన్నిసార్లు దానిని "చిన్న ఏథెన్సు" అని సూచించేవారు.

ఈ పట్టణం యొక్క భౌగోళిక ముఖ వైఖరి గుర్తింపవలసియుంటుంది: అది లోప భూయిష్టమైన రేఖలలో కట్టబడినందున మామూలు కంటె ఎక్కువ భూకంపాలను చవిచూచింది.[3]

> (సార్దీస్ చేర్చి), ఆ ప్రాంతంలోని యితర పట్టణాలతో పాటు క్రీ. శ. 17లో ఫిలదెల్ఫియ భయంకరమైన భూకంపంచే నాశనం చేయబడింది, ... ఆ ప్రాంతాన్ని బాధించిన అదుళ్లు కొనసాగుచుండుటచే అనేక సంవత్సరాలు జనులు భయభీతులతో ఉండిపోయారు మరియు ఆ భయాన్ని బట్టి జనాల్లో ఎక్కువమంది గుడిసెలలోను పట్టణానికి వెలుపల సమీప గ్రామాల్లోను నివసించారు.[4]

ఆ పట్టణాన్ని గూర్చి ప్రభువుకు కావలసిన అతి ముఖ్యమైన విషయం తన ప్రజల సమాజం కూడడం – గతంలో బహు తీక్షణంగా పరీక్షింపబడి భవిష్యత్తులో అంతకుమించి

శ్రమ పెట్టబడిన సంఘం.[5] ప్రభువు యొక్క లేఖలో వారికి ఏ విధమైన నిందలేదు. తనకెంతో విలువైన ఆ చిన్న మందను ఆదరించడానికి అది వ్రాయబడింది.

## ఆయనను బట్టి ఆదరణ (3:7)

యేసు తనను గూర్చిన గుర్తింపును సభ్యులకు జ్ఞప్తికి తెచ్చి మొట్ట మొదట వారిని ఆదరించాడు: "ఫిలదెల్ఫియలో ఉన్న సంఘపు దూతకు [వర్తమానికునికి] ఈలాగు వ్రాయుము: దావీదు తాళపుచెవి కలిగి, యెవడును వేయలేకుండ తీయువాడును,[6] ఎవడును తీయలేకుండ వేయువాడునైన సత్యస్వరూపియగు పరిశుద్ధుడు చెప్పు సంగతులేవనగా" (7 వ.). (పేజీ 19 చూడు.)

### హింసించువారు వెల్లడి చేయబడుదురు

"పరిశుద్ధుడు" అని యేసు తన్నుతాను గుర్తింపజేసికొన్నారు. "పరిశుద్ధుడు" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి అర్థం "పరిశుద్ధుడగు[వాడు]"; ఈ ఒరిజినల్ పదం దేవునికి ప్రత్యేకించబడింది (యెషయా 40:25; హబక్కూకు 3:3; ప్రకటన 6:10). ఈ విధంగా యేసు తన దైవత్వాన్ని స్థాపించాడు – అయితే ఆయన అంతకంటె ఎక్కువ చేశాడు. పరిశుద్ధుడుగా ఆయన పాపాన్ని సహించలేడు, సహించబోడు. దుష్టులు శిక్షింప బడతారనడానికి ప్రత్యేకించి క్రైస్తవులను హింసించేవారు శిక్ష పొందుతారనే గ్యారంటీ యివ్వబడింది.

తరువాత, "సత్యస్వరూపి"యని ఆయన తన్ను సూచించుకున్నారు (అక్షరార్థంగా, "సత్యమైన[వాడు]"). ఫిలదెల్ఫియ అబద్ధపు దేవుళ్లతోను, అబద్ధపు యూదులతోను నిండియుంది (3:9), కాని ప్రభువైన యేసైతే సిసలైనవాడు, ఆధారపడదగినవాడు.

హింసింపబడుతున్న క్రైస్తవులకు ఈలాటి లక్షణాలు ఆదరణ కలిగిస్తాయా? 6వ అధ్యాయంలో, హతసాక్షులు ప్రభువును సంబోధించినప్పుడు, "సత్యస్వరూపీ పరిశుద్ధుడా" అని పిలిచారు (6:10): ఆయన పరిశుద్ధుడు గనుక పాపానికి ఆయన తీర్పు తీర్చుతారని వారికి తెలుసు. ఆయన సత్యవంతుడు గనుక, తన ప్రజల పక్షంగా న్యాయం జరిగిస్తారని వారికి తెలుసు.

### అధికారం ప్రయోగిస్తారు

"దావీదు తాళపుచెవి" తనకున్నట్టు యేసు తెలిపారు (యెషయా 22:15–25 చూడు).[7] "తాళపుచెవి" కలిగియుండడమంటే, తనకు అధికారమియ్యబడినట్టుగా సూచిస్తుంది,[8] ప్రత్యేకించి అంగీకరించడానికి లేక అనుమతిని నిరాకరించడానికి అధికారం.[9] యేసుకు దావీదు తాళపు చెవి కలదన్న వాస్తవం ఆయన దావీదు సంతతిలో నుండి వచ్చిన మెస్సీయగా ఆయనను రుజువుచేస్తుంది (2 సమూ. 7:16). ఆయన యిప్పుడు దావీదు సింహాసనం మీద కూర్చుండి ఏలుబడి చేస్తున్నట్టును రుజువుచేస్తుంది (అపో. 2:30–36).

యేసు ఒక్కరే ఆ తాళపుచెవి కలిగియున్నారు. గనుక, ఆయన తెరిచినదాన్ని ఎవడు మూయలేడు; ఆయన మూసినదాన్ని ఎవడూ తెరువనూ లేడు. “తలుపు నీ యెదుట తీసియుంచియున్నాను; దానిని ఎవడును వేయనేరడు” అని ఆయన ఫిలదెల్ఫియ క్రైస్తవులకు తెలియజేశారు (3:8బి). తన సంఘం కొరకైన ఆయన ఏర్పాట్లను సాతాను తాత్కాలికంగా అడ్డుకోవచ్చు, కాని అంతంలో దేవుని ఉద్దేశాలు నెరవేర్చబడతాయి.

## ఆయన శ్లాఘించినందున ఆదరణ (3:8-10ఎ)

అభినందించబడడం ప్రతి ఒక్కరికి యిష్టమే. తన నమ్మకమైన సంఘానికి యేసు తన అభినందనను కనుపరచారు:

> –నీ క్రియలను నేనెరుగుదును; నీకున్న శక్తి కొంచెమైయుండినను నీవు నా వాక్యమును గైకొని నా నామము ఎరుగననలేదు. ఇదిగో తలుపు నీయెదుట తీసియుంచియున్నాను; దానిని ఎవడును వేయనేరడు. యూదులు కాకయే తాము యూదులమని అబద్ధమాడు సాతాను సమాజపువారిని రప్పించెదను; వారు వచ్చి నీ పాదముల యెదుట పడి నమస్కారము చేసి, ఇదిగో, నేను నిన్ను ప్రేమించితినని తెలిసికొనునట్లు చేసెదను. నీవు నా ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి[10] భూనివాసులను శోధించుటకు లోకమంతటిమిదికి రాబోవు శోధన కాలములో నేనును నిన్ను కాపాడెదను (8–10ఎ వచనాలు).

### దుర్బలమైనా ఫలవంతమైనది

ఆ స్థానిక సంఘపు “శక్తి కొంచెమైయున్నట్టు” ప్రభువు తెలిపారు. తక్కువైనవారి సభ్యత్వం గూర్చి, తలాంతుల లేమిడిని గూర్చి, తక్కువైన ఆర్థిక పరిస్థితులను గూర్చి ఆయన సూచించియుండవచ్చు. సమాజం స్థానిక సంఘాన్ని తక్కువ చూపు చూచే విషయం కూడ ఆయన యిందు సూచించియుండవచ్చు – సభ్యులలో కొందరి సాంఘీక పరిస్థితివలన (1 కొరింథీ. 1:26 చూడు).

వారి “కొంచెము శక్తి” వారిని కలవరపెట్టేలా కాక వారిని శ్లాఘించడానికే యేసు ప్రస్తావించారు. వారికున్న “శక్తి కొంచెమైనా,” ఏమీ చేయకుండడానికి సాకుగా దాన్ని ఉపయోగించలేదు. గాని తమకున్న కొంచెంలో తాము ఏమి చేయగలరో దాన్ని చేశారు. Alfred Plummer ప్రకారం, ఈ లేఖన భాగం యొక్క భావమిది: “నీకు శక్తి కొంచెముండి ఆ శక్తిని సద్వినియోగం చేసికొన్నందున, దానిని ఎవరు నీ వద్దనుండి తీసివేయలేని అవకాశాన్ని నీకిస్తున్నాను.”[11]

మనకు చేతనైనంత దానికంటె దేవుడు ఎన్నడు మన వద్దనుండి అధికంగా కోరడు, కాని ఆయన మనకు యిచ్చినవాటిని ఉపయోగించాలని ఎదురు చూస్తాడు “మేము కొంచెమే చేయగలం గనుక మేమేమీ చేయము” అనే ఫిలాసఫీగల స్థానిక సంఘాలను, క్రైస్తవులను నేనెరుగుదును. మరోవైపు, ఫిలదెల్ఫియ సంఘమైతే, మార్కు 14:8ఎ లో “తన శక్తికొలది చేసిన” స్త్రీని పోలియుంది, ఆ స్త్రీని ప్రభువు శ్లాఘించారు.

#### హింసింపబడినా పట్టుదలతో ఉంది

క్రైస్తవులు చేయగల ఒక పని – వారు చేసింది – నమ్మకంగా నిలిచియుండడం "నీవు నా వాక్యమును గైకొని నా నామము ఎరుగననలేదు ... నీవు నా ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి" అని యేసు తెలిపారు. తన భూనివాస కాల పరిచర్యలో, యేసు తన శిష్యులకు యిలా చెప్పారు, "–ఒకడు నన్ను ప్రేమించినయెడల వాడు నా మాట గైకొనును" (యోహాను 14:23ఎ).

"నా వాక్యమును గైకొని" "నా నామము ఎరుగలేదు" అనే ప్రయోగం aorist కాలంలో ఉంది, అంటే – గతంలో ఒకసారి సంభవాన్ని సూచిస్తుంది. వారి విశ్వాసం తీవ్రంగా పరీక్షింపబడిన నిర్దిష్టమైన సమయం ఒకటుంది – అంతిపయనువాడు చంపబడిన సమయం కావచ్చు (2:13). యేసును వదులుకొని చక్రవర్తిని ప్రభువుగా అంగీకరించునట్టు వారు ఒత్తిడి చేయబడినా, వారు పట్టు వీడక ఉన్నారు.

వారి "శక్తి" "కొంచెమై"యుండగా వారీపని ఎలా చేయగలిగారు? ప్రభువు యొక్క శక్తి మీద పౌలువలె వారు ఆనుకొనడానికి నేర్చుకొనియున్నట్టు విదితమైయుంది:

> అందుకు – నా కృప నీకు చాలును, బలహీనతయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని ఆయన నాతో చెప్పెను. కాగా క్రీస్తు శక్తి నామీద నిలిచియుండు నిమిత్తము, విశేషముగా నా బలహీనతలయందే బహు సంతోషముగా అతిశయపడుదును. నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను ... (2 కొరింథీ. 12:9, 10).[12]

నేను నడుచుకొంటూ పగిలిన వంతెన దగ్గరకు వచ్చి "ఈ పగులుడును దాటునంతగా దూకడానికి నా కాళ్ల బలం చాలుతుందా?" అని అడగను, "ఈ వంతెన మీదగా నడిచిపోడానికి నన్ను ఆపగల శక్తి ఈ వంతెనకుందా?" అని అడుగుతాను. అలాగే, ఈ జీవిత కష్టాలను మనం ఎదుర్కొనేటప్పుడు, "మనం చాలినంత బలముగలవారమా?" అని కాక "మన ప్రభువు చాలిన బలము కలవాడా?" అని అడుగుతాం. ఆ ప్రశ్నకు ఫిలదెల్ఫియ సంఘం "అవును" అని గట్టిగా బదులిస్తుంది!

## ఆయన దయచేయుదాన్ని బట్టి ఆదరణ (3:8-10బి)

ఫిలదెల్ఫియలోని క్రైస్తవులు పట్టువీడకున్నందున, వారి భవిష్యత్తు ఆశ్చర్యమైన సంభవాలతో నిండి ఉంటాయి.

#### దాగియుండిన శక్తి వృద్ధిచెందింది

ప్రత్యేక అవకాశాలను అనుగ్రహించడంలో యేసు కొనసాగుతారు: "ఇదిగో తలుపు నీయెదుట తీసియుంచియున్నాను; దానిని ఎవడును వేయనేరడు"[13] (8ఎ వ.). క్రొత్త నిబంధనలో తెరువబడిన ద్వారము అనేది ప్రత్యేక అవకాశాలు, ప్రత్యేకించి సువార్త వ్యాపింపజేసే అవకాశాలకు గురుతుగా వినియోగించబడింది (అపొ. 14:27; 1 కొరింథీ. 16:9; 2 కొరింథీ. 2:12; కొలస్సీ. 4:3).[14] గ్రీకు నాగరికత వ్యాపింపజేసే మిషినెరీ

పట్టణంగా అట్టాలస్‌చే ఫిలదెల్ఫియ పట్టణం నిర్మింపబడినా, చిన్న ఆసియాకు తూర్పున ఉన్న ప్రాంతాలకు సువార్తను వ్యాపింపజేసే కేంద్రంగా దేవుడు దాన్ని వాడుకుంటాడు.

ఒక సాహస కృత్యంనుండి[15] ఎదురు చూడని ఆశ్చర్యకరమగు ఉపకారం – మనకు కలిగియున్నదానిలో మనం చేయగలదాన్ని ప్రభువు వృద్ధి చేస్తారు. సాధన చేయడానికి కండరం బలీయంగా రూపొంది యింకా ఎక్కువ చేయగలదు. రెండు తలాంతులు నాలుగుగా మారిపోతాయి (మత్తయి 25:17).

అయితే సంఘము అవకాశాన్ని ఉపయోగించవలసియుంటుంది. యేసు ద్వారం తెరచి ప్రవేశించుడని మనలను ఆహ్వానిస్తారు, కాని ఆయన మనలను బలవంతపెట్టరు. ఫిలదెల్ఫియలోనున్న క్రైస్తవులు పరిస్థితులను అవకాశంగా తీసికొనవలసియుంది. తమ నూతన శక్తితో తాము చేయగలిగింది చేయడంలో కొనసాగిస్తారనడంలో ప్రభువుకు సందేహం లేనట్టు కన్పిస్తుంది.[16]

## పీడని స్థితి న్యాయ నిరూపణ చేయబడుతుంది

తనయందు వారికున్న విశ్వాసం న్యాయ నిరూపణ అవుతుందని యేసు తిరిగి చెప్పారు: "యూదులు కాకయే తాము యూదులమని అబద్ధమాడు సాతాను సమాజపు వారిని రప్పించెదను; వారు వచ్చి నీ పాదములయెదుట పడి నమస్కారముచేసి, ఇదిగో, నేను నిన్ను ప్రేమించితినని తెలిసికొనునట్లు చేసెదను" (9 వ.).

స్ముర్న సంఘాన్ని చదివినప్పుడు "సాతాను సమాజముతో" మనం పరిచయం చేయబడ్డాం (2:9). ఆ పదము మామూలు సమాజమందిరమును సూచించిందని గుర్తించాం. మెస్సీయగా[17] యేసును నిరాకరించిన యూదుల కూటమి. "సాతాను సమాజం" అని పిలువబడ్డారు ఎందుకంటే వారు సాతాను పని చేస్తున్నారు. ఏ విధమైన నేరారోపణ చేయబడని రెండు స్థానిక సంఘాలు – స్ముర్న, ఫిలదెల్ఫియలకు సాధారణమైంది మరొకటి ఉంది: వారిద్దరూ యూదులచే హింసింపబడినవారే.[18] రోమా అధికారులు క్రైస్తవులమీద ఎక్కువైన ఒత్తిడి తేవడానికి యూదులు తమ రాజకీయ సంబంధమైన పలుకుబడిని ఉపయోగించుకొని వారిని ప్రోత్సహించుతూ ఉండవచ్చు.

యేసు స్ముర్నకు వ్రాసినప్పుడు, సాతాను సమాజంవలన కలిగే దూషణనుండి వారు సజీవంగా బయటపడతారని ప్రభువు గుప్తం చేశారు. ఫిలదెల్ఫియ సంఘానికి ఆయన చేసిన వాగ్దానం దాన్ని అధిగమించింది: "వారు [అబద్ధపు యూదులు] వచ్చి నీ పాదములయెదుల పడి[19] నమస్కారముచేసి, ఇదిగో, నేను నిన్ను ప్రేమించితినని తెలిసికొనునట్లు చేసెదను." ఫిలదెల్ఫియలోని యూదులు క్రైస్తవులౌతారని[20] యిది సూచించినట్టు కొందరు నమ్ముతారు; ఆ స్థానిక సంఘానికి "తెరువబడిన ద్వారంలో" యిది భాగమైయుంటుందని వారు తలంచుతారు. మారుమనస్సు పొందని యూదులు క్రైస్తవులను కూడ దేవుని ప్రత్యేకమైన జనులని సణుగుతూ అంగీకరిస్తారనేది దీని భావంగా మరి కొందరంటారు. ఆ మాటలకు భావమేమైయున్నా, యేసు దేవుని కుమారుడని అవిశ్వాసులందరు గుర్తించే దినమొకటి రాబోతుందని బైబిలు తేటగా బోధిస్తుంది (గనుక ఆయనను వెంబడించేవారు రైటు):

నాతోడు, ప్రతి మోకాలును నా యెదుట వంగును, ... అని వ్రాయబడియున్నది (రోమా 14:11).

... పరలోకమందున్నవారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, ... (ఫిలిప్పీ. 2:10, 11).

### కాపుదల నిశ్చయం చేయబడింది

ఫిలదెల్ఫియలోని సంఘాన్ని కాపాడుతూ ఉంటానని యేసు అభయమిచ్చారు: "నీవు నా ఓర్పు విషయమైన వాక్యమును గైకొంటివి గనుక భూనివాసులను శోధించుటకు లోకమంతటిమీదికి రాబోవు శోధన కాలములో నేనును నిన్ను కాపాడెదను" (10 వ.). వారు గతంలో హింసింపబడ్డారు, అంతకంటె ఘోరమైన శ్రమలు వారికొరకు వేచియున్నాయి, అయితే యేసు వారితో ఉంటారు. మాటల ఆటను గమనించు: వారు తన వాక్యాన్ని గైకొన్నందున, ఆయన వారిని కాపాడతారు.

"శోధన కాలమున" త్వరలో సంభవింపబోయే[21] తీక్షణ హింసను సూచిస్తుంది. 6నుండి 19 అధ్యాయాలలో భయంకరంగా పరీక్షించు శోధన కాలానికి సంబంధించి పలు విధాలైన రూప చిత్రాలు వినియోగించబడ్డాయి. "ఈ శోధన కాలము" క్రైస్తవులమీదికి మాత్రమే వచ్చేది కాదు, కాని "లోకమంతటిమీదికి" వచ్చేది,[22] ఇందులో ఒక ఉద్దేశం "భూలోకమంతటిమీదికి శోధించడానికి వస్తుంది." ప్రకటనలో, భూనివాసులు అనేది అవిశ్వాసులను సూచిస్తుంది (6:10; 8:13; 11:10; 13:8, 14; 17:8). భూమిమీద బాధలు కలిగేలా దేవుడు అనుమతించినప్పుడు, అందులో ఒక ఉద్దేశం[23] జనులను మారుమనస్సుకు పిలవడమే.[24] ప్రకటన గ్రంథం గుండా మనం వెళ్లేటప్పుడు యిది జ్ఞాపకముంచుకో; వర్ణింపబడిన భయానకమైన ఆపదలయందు దేవుడు ఏమి సాధింప జూస్తున్నాడో దాన్ని గ్రహించడానికి యిది తాళపు చెవి వంటిది.

10వ వచనంలో యేసు యొక్క మెయిన్ పాయింట్ ఏమంటే, "శోధన కాలంలో" ఆయన క్రైస్తవులను కాపాడతారు. "నుండి" అనేది *ek* అనే గ్రీకు ఉపసర్గమునకు [preposition] అర్థం. "ఇది *అంటకుండ కాపాడడమైనా కావచ్చు లేదా ... లోగుండా క్షేమంగా తీసికొని రావడమైనా* కావచ్చు."[25] 2:10కి "అంటకుండ కాపాడడమని" అర్థమా? యుద్ధము, కరువు, తెగులు అనేవి క్రైస్తవులకు తగులకుండ యేసు అద్భుతరీతిగా టీకాలేమైనా వేస్తారా? కత్తులు, బాణాలు, గొడ్డళ్లు వారిలో దూరకుండునట్లు అదృశ్యమైన కోటగా యేసు వారిని ఆవరించబోతారా? అగ్ని తాకని, మిసైల్స్ తాకని రూపంలో ప్రభువు తన ప్రజలను చేశారా? అలా చేయలేదని నీకే తెలుసు. పరీక్ష అంతమయ్యేలోపు, అనేకమంది క్రైస్తవులు చనిపోతారు (6:9; 17:6 చూడు). గనుక ఆ శోధన కాలము గుండా "వారిని క్షేమంగా తెస్తారనేది" యేసు వాగ్దానం కాదు.[26]

క్రైస్తవులుగా, శ్రమలనుండి స్వాతంత్ర్యం మనకు వాగ్దానం చేయబడలేదు. జీవించడానికి ఆత్మ సంబంధమైన ఆధారాలు మనకు వాగ్దానం చేయబడింది (2 కొరింథీ.

12:9; 2 తిమోతి 3:12; 4:18; హెబ్రీ. 4:16). యేసు ఏర్పాటులో కీలకమైన విషయం[27] నూతన స్వభావం[28] – ఏది ప్రాముఖ్యం. ఏది ప్రాముఖ్యం కాదు అనే విషయంలో మారిన జీవితపు దృక్పథం. కనికరం లేకుండ హింసించబడినప్పుడు పౌలుచేతను యితరులచేతను ప్రదర్శింపబడిన ఆదర్శమైన స్వభావం:

> కావున మేము అధైర్యపడము; మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతనపరచబడుచున్నాడు ... (2 కొరింథీ. 4:16).
>
> కాబట్టి – **ప్రభువు** నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? (హెబ్రీ. 13:6) అని మంచి ధైర్యముతో చెప్పగలవారమైయున్నాము.
>
> నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము (ఫిలిప్పీ. 1:21).

శోధనలు వచ్చినప్పుడు తాను వారిని విడువనని యేసు ఫిలదెల్ఫియలోని క్రైస్తవులకు వాగ్దానం చేశారు. మనలను కూడ ఆయన విడువరు (హెబ్రీ. 13:5).

## ఆయన జ్ఞానమును బట్టి ఆదరణ (3:11)

ప్రభువు ఏర్పాటు సంఘంపైన గల నమ్మకత్వం మీద ఆధారపడియుంటుంది. బలంగా నిలిచియుండడానికి తమకు ఉద్దేశం కలిగించనవసరం ఏమైయుందో యేసుకు తెలుసు.

### ఆయన ప్రసన్నతను గూర్చిన అభయం

యేసు యొక్క ప్రసన్నత ఈ క్రైస్తవులకు అభయంగా అవసరమైయుంది. గనుక ఆయన యిలా అన్నారు: "నేను త్వరగా వచ్చుచున్నాను"[29] (11ఎ వ.) – వారిని కాపాడి వారి శత్రువులను శిక్షించడానికి.

### వారి సహనం అవసరం

విడిచిపెట్టకుండునట్టు ప్రోత్సహింపబడడం కూడా వారికి అవసరం గనుక ఆయన వారిని యిలా కోరాడు: "ఎవడును నీ కిరీటము నపహరింపకుండునట్లు నీకు కలిగినదానిని గట్టిగా పట్టుకొనుము"[30] (11బి వ.). "కిరీటము" అనేది 2:10లో ప్రస్తావించబడినదే – *stephanos*, విజయ కిరీటము. నమ్మకస్థులైన ప్రతి ఒక్కరికి పరలోకమందు భద్రపరచ బడింది (2 తిమోతి 4:8), కాని కిరీటాన్ని పోగొట్టుకోవచ్చు కూడ. దాన్ని నిరోధించడానికి, ఫిలదెల్ఫియలోని క్రైస్తవులు తమకు కలిగియున్నదానిని గట్టిగా పట్టుకొనవలసినవారై ఉన్నారు.

ఈ క్రైస్తవులకు కలిగియున్నది కొంచెమే – దానికి సంబంధించిన ప్రాముఖ్యత వారికి అధికమే ఉంది: వారికి రక్షణుంది, వాక్యముంది, ప్రభువునందు విశ్వాసముంది, దేవుడనుగ్రహించిన కొద్ది బలం, క్రొత్త అవకాశాలు, యేసు వాగ్దానాలు కూడా ఉన్నాయి.

దేవుడు వారికి ప్రసాదించినదానిని గట్టిగా పట్టుకొని, దానిని ఎన్నడూ ఎన్నడూ ఎన్నడూ పోగొట్టుకో కూడదు. సువార్తవలన వారు రక్షింపబడుదురని ఒక గుంపు క్రైస్తవులకు పౌలు తెలిపాడు, "మీరు గట్టిగా పట్టుకొనియున్న యెడల[31] ఆ సువార్తవలననే మీరు" రక్షణ పొందువారైయున్నారు (1 కొరింథీ. 15:2బి).

## ఆయన వాగ్దానములను బట్టి ఆదరణ (3:12)

ఉత్తరంలో ఈ పాయింటువరకు, ఈ జీవిత కాలంలో నమ్మకమైన తనవారికి ఆయన ఏమి చేస్తారో యేసు వాగ్దానాలు ప్రధానంగా దానిపై కేంద్రీకరించబడ్డాయి. రాబోవు జీవము వారికొరకు భద్రపరచబడియున్నట్టు వారు తెలిసికోవాలని ముగించడానికి ముందుగా ఆయన కోరారు:

> జయించువానిని నా దేవుని ఆలయములో[32] ఒక స్తంభముగా చేసెదను; అందులోనుండి వాడు ఇకమీదట ఎన్నటికిని వెలుపలికిపోడు. మరియు నా దేవుని పేరును, పరలోకములో నా దేవుని యొద్దనుండి దిగి వచ్చుచున్న నూతనమైన యెరూషలేమను నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్త పేరును వానిమీద వ్రాసెదను (12 వ.).

### ప్రాధాన్యత

"స్తంభమును" సూచించడంలో ఉన్న ప్రాథమికమైన భావనను మనం గ్రహించగలం. కొన్ని కట్టడాలకు పిల్లర్లు వేస్తారు. కష్టకాలంలో కూడా, "అతడు పిల్లరంత బలమైనవాడు" లేక "అతడు సమాజంలో స్తంభమైయున్నాడనే" మాటలను మనం వింటూ ఉంటాం. "స్తంభము" అనే అలంకారాన్ని మనం ఉపయోగించినప్పుడు, బలమునిచ్చేది, నిలబెట్టేది అనే భావాన్ని మనం సూచిస్తాం (1 తిమోతి 3:15 చూడు) లేక ప్రధానమైనవానిని సూచిస్తాం (గలతీ. 2:9 చూడు).

క్రొత్త నిబంధన బయలుపరచబడుతున్న కాలంలో, "స్తంభము" అనేదానికి అధికమైన అర్థాలున్నాయి. వ్యక్తులను ఘనపరచడానికి కొన్నిసార్లు స్తంభాలను నిలిపారు. ఆ స్తంభాల మీద పేర్లు చెక్కబడేవి. గౌరవనీయుడైన ఆ వ్యక్తికి సంబంధించిన సమాచారం వ్రాయబడియుండేది.[33] నేడు, ఫిలదెల్ఫియ చోటు ప్రాచీన తుయతైర చోటువలెనే ఉంటుంది. నవ గ్రామ[34] నిర్మాణం అదే స్థలంలో జరిగినందున కొద్ది త్రవ్వకాలు మాత్రమే సాధ్యమయ్యాయి. పట్టణంలో ఒక ముక్క మాత్రమే త్రవ్వ సాధ్యమయ్యింది.[35] ఆ ప్రాంతంలో మన స్టడీకి సంబంధించి ఒక్క లక్షణం మాత్రమే యింటరెస్టు కలిగిస్తుంది. పలు ప్రాచీన స్తంభాలు ఆ స్థలంలో నిలిచియున్నాయి, కథానాయకుల పేర్లు వాటిమీద చెక్కబడి ఉన్నాయి.

"నా దేవుని ఆలయములో ఒక స్తంభముగా చేసెదను" అని ప్రభువు అన్నప్పుడు – యిదంతా – యింకా ఎక్కువ ఆయన మనస్సులో ఉండియుండవచ్చు. ఈ జీవితంలో, ఫిలదెల్ఫియలోని క్రైస్తవులు బలహీనంగా ఉన్నట్టు భావించబడ్డారు. కాని "బలమైన స్తంభాలుగా" యేసు వారిని చేస్తారు.

## స్థిరత్వం

ఒక ప్రాముఖ్యమైన ఊహ ఏమంటే – శాశ్వతమైన నివాసం; "అందులోనుండి వాడు ఇకమీదట ఎన్నటికిని వెలుపలికిపోడు"[36] అని యేసు నొక్కి చెప్పారు. ఫిలదెల్ఫియ పౌరులు భవనాలు కూలిపోయి నలిగిపోకుండ తప్పించుకొనడానికి తరచుగా పట్టణంనుండి పరుగెత్తేవారు. కాని పరలోకంలో, ప్రభువు యొక్క స్తంభములు స్థిరముగా నాటబడినవై ఉంటాయి! మనం పరలోకానికి వెళ్లినప్పుడు, శోధన కాలము అంతరించుతుంది. మన నివాసం అంతములేని యుగముల పర్యంతము హామీ యియ్యబడింది! కీర్తన రచయిత యొక్క తీవ్రమైన కోర్కె సఫలమౌతుంది:

> యెహోవాయొద్ద ఒక్క వరము అడిగితిని దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవిత కాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను (కీర్తన. 27:4).

ఆగస్టీన్ యిలా వ్రాశాడు, "ఆ పట్టణంకొరకు వాంఛించనివాడెవడుంటాడు, దానిలో నుండి ఏ స్నేహితుడు వెళ్లిపోడు దానిలోనికి ఏ శత్రువు ప్రవేశింపడు?"[37]

## సొంతం

ఆ స్తంభముమీద "నా దేవుని పేరును, పరలోకములో నా దేవుని యొద్దనుండి దిగి వచ్చుచున్న నూతనమైన యెరూషలేమను నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్త పేరును" వ్రాసెదనని యేసు ప్రమాణం చేశారు. ఈ పేర్లు ఆ స్తంభాలను గొప్ప చేసి, దేవునితో తమ సంబంధాన్ని అవి సూచిస్తాయి.[38]

దేవుని పేరు మనమీద లిఖితమైయుంటుంది ఎందుకంటె ఆయన మన తండ్రి, మన కన్నులనుండి ప్రతి బాష్పబిందువును తుడిచివేయువాడు (7:17; 21:4).

మన పరలోక నివాసానికి "పరలోకములో నా దేవుని యొద్దనుండి దిగి వచ్చుచున్న నూతనమైన యెరూషలేము" అనేది మరొక పేరు (21:2, 10 చూడు).[39] (పేజీ 33 చూడు.) పాత యెరూషలేము యిరవై సంవత్సరాలకు ముందే, క్రీ.శ. 70లో రోమీయులచే నాశనం చేయబడింది. అయితే క్రైస్తవులు "పైనున్న యెరూషలేము" వైపుకు తేరి చూడవచ్చు (గలతీ. 4:26; హెబ్రీ. 12:22 చూడు). ఆ పట్టణానికి "దేవుడు శిల్పియు నిర్మాణకుడునై యున్నాడు" (హెబ్రీ. 11:10).[40] "నూతన యెరూషలేము" పేరు మనమీద వ్రాయ బడుతుంది ఎందుకంటె, అది మన శాశ్వతమైన అడ్రస్.

దీనికితోడు, యేసుయొక్క "నూతనమైన పేరు" మనం పొందుతాం.[41] పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తెపై తన పేరు ఉంచి ఘనపరచినట్టు. క్రైస్తవులుగా, క్రీస్తు పెండ్లి కుమార్తె యొక్క భాగమైయున్నాం – సంఘం (ఎఫెసీ. 5:23–33). ఒక దినాన, తనకొరకు దానిని తీసికొనడానికి ఆయన ప్రత్యక్షమౌతారు. "ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము" (1 యోహాను 3:2బి).

## ముగింపు

“సంఘములతో **ఆత్మ** చెప్పుచున్న మాట చెవిగలవాడు వినునుగాక” (13 వ.)

వ్యక్తిగతంగా నాకు ఈ ఉత్తరం విలువైన వర్తమానం యిచ్చింది. దాని మాటలు నన్ను సవాలు చేస్తున్నాయి. దేవుడు నాకు అనుగ్రహించే అవకాశాలను శ్రమించి చూచి వాటిని నేను ఉపయోగించుకోవాలి. ఆయన వాక్యానికి లోబడడానికి నా సమర్పణను తిరిగి నూతనపరచుకొని, ఆయనను ఎన్నడూ ఎరగననక ఉండాలి. నా బాధ్యతకు దేవుడు అప్పగించినదానిని నేను నా కిరీటము అపహరింపబడకుండునట్టు గట్టిగా పట్టుకోవాలి. ప్రత్యేకంగా, ఈ ఉత్తరం నన్ను ప్రోత్సహిస్తుంది. బలహీనుడనైన నేను, ఒక నాటికి బలమైన స్తంభముగాను స్థిరంగాను కావాలి.

“కట్టబడుతున్న” అనే గురుతును మనమందరం ధరించుకోవాలని చెప్పబడింది. “ఆయన యింకను నా మీద పని చేస్తున్నారు” అనే పాట యొక్క సెంటిమెంటును నేను యిష్టపడతాను. ఆయనకు సమీపంగా నిలిచి నేను నిరాశపడనట్టయితే, యింకా నాతో ఆయన ఏదో ఒకటి చేయగలడు![42]

---

## ఉపదేశకులకు, సువార్తికులకు నోట్సు

“తెరువబడిన ద్వారం గల సంఘమని” (లేక “తెరువబడిన ద్వారము”) సువార్తికులు దీనికి తరచుగా పేరు పెట్టుతూ, అవకాశాలను, ప్రత్యేకించి సువార్తకొరకైన అవకాశాలను వినియోగించుకొనడం గూర్చి నొక్కి చెప్పుతారు. “సహోదర ప్రేమ సంఘమని” కూడా దీన్ని పిలువవచ్చు, ఒకరినొకరు ప్రేమించుకొనడం మీద నొక్కి చెప్పుతారు (యోహాను 13:34; రోమా 5:5; 1 థెస్స. 4:9; 1 యోహాను 4:19): ఆత్మ సంబంధంగా మాట్లాడితే, సహోదర ప్రేమగల ఫిలదెల్ఫియ పట్టణంలో మనమందరం నివసించాలి.

---

సూచనలు

[1]“ఆసియాలోని ఏడు సంఘాలు, పత్మాసు ద్వీపము” పటాన్ని చూడు. [2]అమెరికాలో పెనిస్సిలేవియా అనేది ఫిలదెల్ఫియాగా మారుపేరు పెట్టబడింది. దాని మోటో “సహోదర ప్రేమ పట్టణం.” [3]ఆ ప్రాంతమంతా భూకంపాలకు లోనైయుంటుంది. టూర్ గ్రూప్‌కు గైడు పట్టణపు శిథిలాలను చూపి, ఆ పట్టణాన్ని పాడుచేసిన భూకంపం జరిగిన డేట్ చెప్పుతాడు. [4]Homer Hailey, *Revelation*: *An Introduction and Commentary* (Grand Rapids, Mich.: Baker Book House, 1979), 149. [5]ఆ స్థానిక సంఘం ఎప్పుడు స్థాపింపబడిందో మనకు తెలియదు; ఎఫెసులో పౌలు పరిచర్య కాలంలో కావచ్చు (అపొ. 19:1, 8–10). [6]“తెరుచుట,” “మూయుట” రెండును వర్తమాన కాలమే – కొనసాగించే క్రియను చూపుతుంది. ప్రభువు తన సంఘ జీవితంలో జోక్యం పుచ్చుకొంటూ ఉంటారు. [7]“ ‘దావీదు తాళపు చెవి’ అనేది యెషయా 22:22కు తీసికొని వెళ్లుతుంది. మంచి రాజైన హిజ్కియాకు నమ్మకమైన గృహ నిర్వాహకుడు ఏలియాకీము ‘దావీదు తాళపు చెవి’ కలిగినవాడైనట్టు చెప్పబడింది. రాజు సముఖానికి వెళ్లే దరఖాస్తులు తాను మాత్రమే తీసికొనే హక్కుగలవాడై యున్నాడు ... రాజునొద్దకు వెళ్లడానికి తన ద్వారా వెళ్లాలి, రాజు సముఖానికి వెళ్లే ద్వారం తెరవడానికైనా మూయడానికైనా హక్కు తనకే ఉంటుంది” (Rubel Shelly, *The Lamb and His Enemies: Understanding the Book of Revelation* [Nashville: 20th Century Christian Foundation, 1983], 41). [8]“అన్ని పరిధుల్లో పూర్ణమైన ఏలుబడి యేసుదే: పరలోకమందును భూమిమీద (మత్తయి 28:18), ‘దేవదూతలమీదను

అధికారాలమీదను, శక్తులమీద' (1 పేతురు 3:22), సంఘంపై (ఎఫెసీ. 1:20–22), భూపతులమీద (ప్రకటన 1:5) మరియు మరణంమీద పాతాళలోకం మీద (ప్రకటన 1:18)" (Hailey, 150). [9]ఫలాని వ్యక్తి రక్షింపబడతాడా లేక నశించిపోతాడా? అని అప్పుడప్పుడు నన్ను అడుగుతూ ఉంటారు. అంగీకరించే నిరాకరించే హక్కు యేసుకే ఉంటుంది, అవి ఆయన తీర్మానాలు నావి కావు అని నేను అంటాను (అది అలాగైయుండటానికి నేను కృతజ్ఞత చెల్లిస్తాను) నేను దేవుడను కాను; నేను ఆయన వాక్యాన్ని ప్రకటించే ప్రీచర్‌ను మాత్రమే, నా పని వాక్యం ప్రకటించడమేయని నేను నొక్కి చెప్తుతా: "ఒకని అభిప్రాయం అడిగేదానికి బదులు, రక్షణ విషయంలో బైబిలు ఏమి చెప్తుతుంది? అని నీవు అడగాలి అంటూ నేను ముగిస్తాను." [10]"నీవు నా ఓర్పు విషయమైన వాక్యము గైకొంటివి" అనే ప్రయోగం వింతగా ఉంటుంది. "నా ఓర్పును గూర్చి తెలియజేయు వాక్యము" అనేది దాని అర్థమైయుండవచ్చు. నిలకడ కలిగియుండడానికి క్రీస్తు మనకు మాదిరి ఉంచిపోయారు (హెబ్రీ. 12:2, 3). అంతంవరకు సహించడం ఆయన ప్రకటించడం (మత్తయి 24:13) మాత్రమే కాదు, ఆయన ఆచరించారు కూడా.

[11]Alfred Plummer, "The Revelation of St. John the Divine," in *The Pulpit Commentary,* vol. 22, *Epistles of Peter, John & Jude, The Revelation,* ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 111. [12]యెషయా 40:29; హెబ్రీ. 11:34 చూడు. [13]"దానిని ఎవడును వేయనేరడు" అనడంలో, ఎవడైనా మూయ ప్రయత్నించ వచ్చునని గుప్తమైయుంది; 1 కొరింథీ. 16:9లో పౌలు యిలా అన్నాడు, "కార్యానుకూలమైన మంచి సమయము నాకు ప్రాప్తించియున్నది; మరియు ఎదిరించువారు అనేకులున్నారు." సువార్త ప్రకటనను అపవాది ఎన్నడు సులభంగా వదలడు. ద్వారం తెరువబడినప్పుడు, ఈగలు యితర ఆయా జీవులు ప్రవేశింపవచ్చు అని ఒక వ్యక్తి అన్నాడు! [14]"తెరువబడిన ద్వారాన్ని" సాధారణ సేవకు తెరువబడిన ద్వారం, అభివృద్ధికి తెరువబడిన ద్వారం అంటూ సాధ్యమయ్యే యితర భావాలు సూచింపబడ్డాయి. దీనికితోడు, నిత్య ఆశీర్వాదానికి "తెరువబడిన ద్వారం" (2 పేతురు 1:10, 11) లేదా ప్రకటనకు "తెరువబడిన ద్వారం" (ప్రకటన 4:1) అనేవి యేసు మనస్సులో ఉండవచ్చునని చెప్పబడింది. [15]A serendipity సాహస కార్యంనుండి ఎదురు చూడని ఉపకారం. [16]మనం ఉపయోగించుకోలేని కార్యానుకూలతను ప్రభువు ఎన్నడు యివ్వరు. "ప్రభువు ఆజ్ఞాపించినప్పుడు, ఆయన సామర్థ్యాన్ని కూడ కలిగిస్తారు" అని ఒక వ్యక్తి అన్నాడు. [17]యేసునంగీకరించినవారే "నిజమైన" యూదులని పౌలు నొక్కి చెప్పాడు (రోమా 2:28, 29). [18]క్రీ.శ. 70లో, యెరూషలేము నాశనం చేయబడిన తరువాత సమాజ మందిరాల్లో క్రైస్తవులకు వ్యతిరేకత అధికం చేయబడింది. [19]The KJVలో "worship" అని ఉంది, "worship" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం సాధారణమైనది. The ASV కూడ "worship" అని, యిలా ఫూట్ నోట్ చేర్చింది: "ఎందుకంటె అది భయభక్తి కార్యాన్ని సూచిస్తుంది, సృష్టమునకు లేదా సృష్టికర్తకే గాని." ఒకనాడు అన్యజనులు యూదుల యెదుట – వారు సత్య దేవుని ఆరాధించువారని – నమస్కారం చేస్తారని యెషయా పలికాడు (యెషయా 49:23; 60:3, 14లను చూడు). ఈ వాగ్దానానికి యేసు ఒక మలుపు తిప్పారు; యిప్పుడు యూదులు ఆ గుర్తింపు నివ్వవలసియుంది. [20]ఈ వర్ణన ఆయన మెస్సీయ యొక్క లక్షణాలను నొక్కి పలికినట్లు వారు సూచించారు. ప్రకటన వ్రాయబడిన 20 సంవత్సరాల తరువాత, ఫిలదెల్ఫియనుండి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను బట్టి ఆ స్థానిక సంఘం యూదా మత బోధకులచే బాధింపబడిందని – కొందరు యూదులు క్రైస్తవులయ్యారని కూడా వారు గుర్తించారు. ఇలా మాట్లాడేవారు "మోసం చేయబడినవారు, విజేతలు విజయంలో ఒకే రకంగా పాలుపొందారని తలంచుతున్నారు."

[21]"శోధన కాలము" అంటే యేడేండ్లు శ్రమల కాలమని వెయ్యేండ్ల పరిపాలనకు ముందు అవి భూమిమీద జరుగుతాయని వెయ్యేండ్ల పరిపాలనావాదులు అంటారు. ("ప్రకటన గ్రంథం 1లో," అనేకమంది వెయ్యేండ్ల పరిపాలనావాదులు ప్రతిపాదించిన ప్రకటన అవుట్‌లైన్ చార్టు చూడు.) "లోకమంతటిమీదికి" రాబోవు "శోధన కాలమది" గమనించు. 19 శతాబ్దాల తరువాత జరుగబోయే శ్రమ కాలాన్ని గూర్చి యేసు మాట్లాడడం లేదు, కాని వెనువెంట భవిష్యత్ సమస్యలను గూర్చియే మాట్లాడతారు. [22]లోకమంతటిని అది సూచింపవచ్చు, ప్రజలుగల లోకం, లేక రోమా సామ్రాజ్యమంతా. ప్రకటనలో రోమా సామ్రాజ్యమే ప్రాథమికం. [23]పరీక్ష యొక్క మరొక ఉద్దేశమేమంటే, పరీక్షింపబడిన దాని నిజ స్వభావాన్ని తెలిసికొనడం. అలాగే, నిజ దేవుని వ్యతిరేకించేవారు, మారుమనస్సు పొందనివారు పరీక్షలో విఫలులౌతారు. పాత నిబంధన సమాంతరపు మాటకొరకు ద్వితీయో. 4:34; 7:19; 29:2, 3లను చూడు. "శ్రమ" (పరీక్షించబడు). [24]ఆపద కలిగినప్పుడు మనుష్యులు మారుమనస్సు పొందలేదు అనే వాస్తవం నొక్కి చెప్పబడింది చూడు (9:20, 21; 16:9, 11). వారు మారుమనస్సు పొందాలనేది దేవుని కోరికైయున్నట్టు అది సూచిస్తుంది (2 పేతురు 3:9 చూడు). [25]Henry Alford, quoted by


Hailey in *Revelation,* 152. [26]ఆ దినపు బాధలను ఫిలదెల్ఫియాలోని క్రైస్తవులు కొందరు తప్పించుకున్నారని కొందరు నమ్ముతారు. భూకంపాల భయంవలన ఫిలదెల్ఫియాకు ట్రేజన్ దూరంగా ఉన్నాడని వారు అంటారు. కొల్లకొట్టే సిథియనులు ఫిలదెల్ఫియాను దాటిపోయేవారు ఎందుకంటె పెద్ద పట్టణాల్లోకంటె తక్కువ ధనం ఉంటుందని. ఈ తాత్కాలికమైన మినహాయింపులు యేసు వాగ్దానంలో భాగమైయున్నాయో, లేవో కాని యేసు తన ప్రజలకు యిచ్చే ఆత్మ సంబంధమైన కాపుదలయే గాని భౌతికమయ్యింది కాదని ప్రకటనలో మిగిలింది నొక్కి చెప్పుతుంది. [27]సహింపగలిగినదానికంటె ఎక్కువగా శోధింపబడనియ్యడనే వాగ్దానం వంటి యితర సంగతులు అందులో ఉన్నాయి (1 కొరింథీ. 10:13). [28]144,000మంది ముద్రింపబడే చర్చ సమయంలో దైవ కాపుదల వివరించబడుతుంది (7:3, 4). ఈ పుస్తకంలో తరువాత కన్పించే "తుఫానుకు పైగా లేచుట" అనే పాఠాన్ని చూడు. [29]"నేను త్వరగా వచ్చుచున్నాను" అనేది తాత్కాలికపు రాకడకు వర్తింపవచ్చు లేక రెండవ రాకడకు వర్తింపవచ్చు. క్రీస్తు ఎప్పుడైనా రావచ్చును గనుక రెండవ రాకడ భావన "జరుగనున్నది" (యాకోబు 5:7, 9; ఫిలిప్పీ. 4:5), అయితే సందర్భం తాత్కాలికమైన రాకడను యిష్టపడుతుంది. [30]కిరీటం అపహరింపబడకుండ (రక్షణ పోగొట్టుకొనకుండ) చూచుకొనమనే ప్రభువు హెచ్చరికలో, విశ్వాస భ్రష్టత్వం జరిగే అవకాశాన్ని సూచిస్తుంది. ప్రకటన సూచించే అనేకమైనవాటిలో యిది ఒకటి. చిత్రం ఒకే సత్యాన్ని ఉదహరిస్తుంది. ఇతరులు నీ రక్షణను తీసికొని నిత్యత్వం అనుభవిస్తారని దీని భావం కాదు!

[31]"గట్టిగా పట్టుకొనడమనేది" గ్రీకులో ఒకే క్రియా వాచకం, వర్తమాన కాలంలో ఉంది, కొనసాగించే కార్యాన్ని సూచిస్తుంది. "గట్టిగా పట్టుకొనడంలో" కొనసాగమని వారు బోధింపబడ్డారు. [32]"దేవుని ఆలయం" అనేది యిక్కడ సంఘమనే అర్థమైయుండవచ్చు (1 కొరింథీ. 3:16; ఎఫెసీ. 2:21; ప్రకటన 11:1, 2ల్లో వలె). చివరిగా విజేతలయ్యేవారిని గూర్చి యేసు మాట్లాడినందున, "దేవుని ఆలయము" అనేది పరలోకం కావచ్చు – ప్రకటన గ్రంథంలోని ఎక్కువ చోట్ల చెప్పబడినట్టు (11:19; 14:17లను చూడు). పరలోకంలో దేవాలయాన్ని యోహాను చూడలేదని కొందరు ఆక్షేపణ తెలియజేస్తారు (21:22). అలంకారాలు గ్రంథంలో మార్పు చెందవచ్చు. అనుగుణ్యంగా ఉండాలనేది ప్రాముఖ్యం కాదు అని గుర్తుంచుకో. అయినా, 3:12ను 21:22తో సమన్వయం చేయడం ప్రాముఖ్యమని నీవు తలంచితే, దీన్ని ఆలోచించు: పరలోకమంతా దేవుని ఆలయమైయుంటుంది (అక్కడ మనమాయనను ఆరాధించి సేవిస్తాం); గనుక "దేవాలయమనే" ఒక కట్టడాన్ని యోహాను చూచియుండక పోవచ్చు. [33]నేడు కట్టే జ్ఞాపకార్థ చిహ్నాలకు దీన్ని పోల్చవచ్చు. [34]ఈ గ్రామం పేరు Alasehir. [35]ఆ బ్లాక్‌లో చర్చి బిల్డింగ్ యొక్క ప్రాచీన శిథిలాలు ఉన్నాయి – ఒకప్పుడు యేసునందలి విశ్వాసం అక్కడ వర్ధిల్లిందని జ్ఞాపకం చేస్తుంది. దానికి ఎదురులో, పెద్ద ముస్లిముల మాస్క్ దైనిక ఉపయోగంలో ఉంది. [36]గ్రీకు వ్యాకరణంలో రెండు నెగెటివ్‌లు ఉపయోగించేది విషయాన్ని నొక్కి చెప్పడానికి: "ఏ విధంచేతనైనను అతడు వెలుపలికి పోడు!" [37]Quoted by James M. Tolle, *The Seven Churches of Asia* (Pasadena, Tex.: Haun Publishing Co., 1968), 69. [38]12వ వచనంలో దేవుడు ఘనపరచబడ్డాడు: "నా దేవుడు" లేక నా దేవుని అనే ప్రయోగాలు నాలుగుసార్లు కన్పించాయి. [39]ఈ "యెరూషలేము" "పరలోకమునుండి దిగివస్తున్నందున," కొందరు దీన్ని భూమిమీదనున్న సంఘంగా గుర్తించారు. ఇది "క్రీస్తు యొక్క వెయ్యేండ్ల రాజ్యమని" మరికొందరన్నారు. ఎలాగున్నా, పరలోకపు పరిధిలో మహిమపరచబడినదిగా అది సూచిస్తున్నట్టు ఎక్కువమంది రచయితలు అంగీకరిస్తారు (ఏకీభవిస్తారు) "పరలోకమునుండి దిగివచ్చుట" అనే ప్రయోగం, కేవలం మన కొరకైన దేవుని ఏర్పాటును నొక్కి చెప్పుతుంది. [40]హెబ్రీ. 13:14 చూడు.

[41]2:17లో ప్రస్తావింపబడిన "క్రొత్త పేరే" యిది కావచ్చు "క్రొత్త పేరు" అనే భావన ఫిలదెల్ఫియాకు ప్రత్యేకమైన విశేషం కావచ్చు. ఎందుకంటె ఫిలదెల్ఫియ పట్టణానికి సంవత్సరాల్లో పలు పేర్లు యివ్వబడ్డాయి. [42]నీకు నీవే దాన్ని వర్తింపజేసికోవచ్చు – నీ శ్రోతలకు కూడా. వారు క్రైస్తవులు కానట్టయితే, సువార్తకు లోబడడానికి వారిని ప్రోత్సహించు (అపొ. 2:36–38).

## రివ్యూ మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. ఏడింటిలో అతి శ్రేష్ఠమైన సంఘమేది? అన్నింటిలో బహు చెడిపోయినదేది? (తరువాత పాఠం చూడు).
2. "ఫిలదెల్ఫియ" అనే పేరుకు అర్థమేమి?
3. అట్టాలస్ ఫిలదెల్ఫియను ఎందుకు నిర్మించాడు? అక్కడున్న సంఘం పట్ల ప్రభువు ఉద్దేశానికి అది ఎలా సంబంధం కలిగియుంది.
4. ఫిలదెల్ఫియాకు ఉన్న భూగర్భ సంబంధమైన సమస్య ఏమి? ఉత్తరం చివరిలో చేయబడిన వాగ్దానాలలో ఈ సమస్య ప్రతిబింబిస్తుందా?
5. క్రొత్త నిబంధనలో "తెరువబడిన ద్వారము" అనే భాష దేన్ని సూచిస్తుంది?
6. "శక్తి కొంచెమైనను" అనేది అవమానానికి ఉద్దేశింపబడిందా లేక శ్లాఘించ డానికా?
7. "సాతాను సమాజము" అంటే ఏమి?
8. యూదులు క్రైస్తవుల పాదముల యొద్ద "పడడమనేది" ఏ భావంలో?
9. "లోకమంతటి మీదికి రాబోవు" "శోధన కాలం" ఏమి?
10. "శోధన కాలం"నుండి వారిని కాపాడెదనని ప్రభువు అన్నప్పుడు, శ్రమలు పొందకుండ క్రైస్తవులు తప్పింపబడతారని దాని అర్థమా?
11. ప్రకటనలో "భూనివాసులందరు" అంటే ఎవరు?
12. 3:12లో "స్తంభము" అనే పదంలో గుప్తమైన కొన్ని సంగతులేవి?
13. క్రొత్త నిబంధన బయలుపరచబడుతున్న కాలంలో స్తంభాల మీద పేర్లు ఎందుకు వ్రాయబడేవి?
14. "నూతన యెరూషలేము" అంటే ఏమి?
15. నిన్ను సవాలు చేసినవిగాని, లేక ఎదుర్కొన్నవి గాని ఈ పాఠంలో నీవేమైనా కనుగొన్నావా?



నూతన యెరూషలేము (21:2, 10)